# నైజం

-మావూరి విజయలక్ష్మి



"అమ్మలో కూడా ఆడదాన్ని చూడగలిగే వెధవా! నువ్వు మనిషి రూపంలో పశువ్వి రా!" గదంతా ప్రతిధ్వనించాయా మాటలు.

అదొక చిన్న ట్యుటోరియల్ కాలేజీలో ఆఫీసు రూము. టేబుల్‌కు అటువైపున్న కుర్చీలో కూర్చున్న ప్రిన్సిపాల్ సుధాకర్ బిత్తరపోయి చూస్తున్నాడు. ఇటువైపు నిలబడిన పల్లవి ఆవేశంతో రొప్పుతోంది.

"పల్లవిగారూ! ప్లీజ్... అలా అరవకండి అందరూ వింటారు" బ్రతిమాలుతున్నట్టుగా అన్నాడు సుధాకర్.

"ఏం... భయంగా ఉందా? ఈ భయం ముందే ఉండాల్సింది. అందర్నీ పిలవనివ్వు, నీ గొప్పతనం అందరికీ తెలిసి, వాళ్ళు మేకతోలు కప్పుకున్న నీ నిజస్వరూపం తెలుసుకొని నీ మొహాన ఉమ్మేసినపుడుగాని నీకు బుద్ధిరాదు" కొట్టినట్టే వచ్చింది జవాబు.

అప్పటికే ఈ కేకలు విన్న మిగతా టీచర్స్ ఏమిటేమిటంటూ అక్కడికి చేరిపోయారు. పిల్లలు గది కిటికీల్లో నుంచి తొంగి తొంగి చూస్తున్నారు. సుధాకర్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలకలా తయారయింది. జరిగిన విషయాలు నలుగురిలోను బయటపెడితే తమకే అవమానమన్న భయంతో ఈ ఆడవాళ్ళు తనెలా ప్రవర్తించినా లొంగి ఉంటారనుకున్నాడు. కాని పరిస్థితి ఇలా ఎదురు తిరుగుతుందనుకోలేదు.

జరుగుతున్నదంతా చూస్తున్న సైన్స్ టీచర్ వేణుకు రూఢిగా విషయం ఇదీ అని తెలియకపోయినా చూచాయిగా అర్థమయింది. అర్జెల్లక్రితమే ఆ స్కూల్లో చేరిన అతనికి సుధాకర్‌తో బాగా స్నేహం కుదిరింది. దాంతోపాటు అతడి మనస్తత్వం కూడా పూర్తిగా అవగతమయ్యింది. సుధాకర్‌కు ఆడవాళ్ళపట్ల చాల నీచమైన భావాలున్నాయి. అందులోనూ బ్రతుకుతెరువు కోసం ఆడవాళ్ళు కేవలం విచ్చలవిడిగా తిరగడానికే, మగాళ్ళతో కబుర్లు చెప్పడానికే ఉద్యోగాల్లో చేరతారనే హేయమైన అభిప్రాయం ఉందతనికి.

నెనక అండలేని స్త్రీలంటే మరీ చొరవ తీసుకోవాలని ప్రయత్నిస్తాడు. ఇప్పుడే పల్లవి విషయంలో కూడా అలాంటిదేదో జరిగుంటుందనిపించింది అతనికి.

తన దగ్గర పనిచేసేవారి ముందు ఇలా తలొంచుకుని నిలబడాల్సి రావడం చాలా ఇబ్బందిగా, అవమానంగా ఉంది. సుధాకర్‌కు. పల్లవిని తినేసేలా చూస్తూ పళ్ళు నూరుకోసాగాడు. అందరూ తనను నిలదీస్తున్నట్టనిపించింది. ఎదురుగా ఉన్న టీచర్లలో సుధ కూడా ఉంది. అప్రయత్నంగా ఆమె వైపు చూసాడు. ప్రపంచంలో ఉన్న అసహ్యాన్నంతటినీ కళ్ళలో నింపుకొని ఒక పురుగును చూసినట్టు చూస్తోందామె. కొద్ది రోజుల క్రితం తనకు అతనికీ మధ్య జరిగిన సంభాషణ మదిలో మెదిలిందామెకు.

ఆరోజు క్లాసులో బాగా వెనకబడివున్న కొందరు స్టూడెంట్స్ గురించి మాట్లాడడానికి ప్రిన్సిపాల్ రూమ్‌లోకి వెళ్ళింది సుధ. విద్యార్థుల విషయం అతనితో చర్చించిన తరువాత బయటకు వచ్చేయబోతుండగా "మీకిప్పుడేం క్లాస్ లేదు కదా! కూర్చోండి మేడం" అన్నాడతను.

ఆమెకు అర్థమయిపోయింది. అతను తన సహజధోరణి మొదలుపెడతాడని. అతడితో మాట్లాడాల్సి వచ్చినప్పుడల్లా

చాలా చిరాగ్గా అసహనంగా వుంటుందామెకు. తన గురించి ఎదుటివాళ్ళు ఏమనుకుంటున్నారో అన్న సిగ్గు, అభిమానం పూర్తిగా వదిలేసినట్టు మాట్లాడతాడు. అందరికీ చెప్పి వాడి బండారం బయటపెట్టాలన్నా ఆ పరిస్థితి అనుభవించిన వాళ్ళకే తెలియాలి తప్ప వినేవారికి చాలా చిన్నవిషయంగా కనబడుతుంది. పాలు చిక్కినప్పడల్లా అతి తెలివితో వెకిలిగా మాట్లాడడం అలవాటయిపోయిందతనికి. "ఈ రోజెలాగయినా గట్టిగా బుద్ధిచెప్పాలి వెధవకి" మనసులోనే నిర్ణయించుకుంది.

"చెప్పండి సర్" అంది తిరిగి కూర్చుంటూ.

"మీరే ఏదైనా మాట్లాడండి సుధగారూ!"

"నాకు మీతో చెప్పే కబుర్లేం ఉంటాయి?" చిరాగ్గా అంది.

ఏదో ఒకటి చెప్పండి. ఈ రోటీన్ వర్క్‌తో భలే బోర్‌గా ఉంది. అన్నట్టు మీరామధ్య ఏదో గవర్నమెంట్ జాబ్‌కి అప్లయ్ చేసానన్నారు ఏమయిందది?" ఆమె చిరాకును ఏమాత్రం పట్టించుకోకుండా అడిగాడు.

"సెలక్షన్ రాలేదు."

"అరే! నాకు చెప్పలేదేంటి మరి?"

ప్రతీదీ వాడితో చెప్పాలి కాబోలు! ఆమెకు అసహనం పెరిగిపోతోంది. అతని అతిచనువు చూస్తుంటే ఒంటికి కారం రాసుకున్నట్టుగా ఉంది.

"నా స్వంత విషయాలు ఇంకొకరితో చర్చించడం నాకిష్టం ఉండదు" ముక్తసరిగా చెప్పింది.

"అదేంటండీ నేనెంత ఫ్రెండ్లీగా మాట్లాడినా మీరేం చెప్ప రేంటి? అన్నట్టు నేనేం తప్పగా మాట్లాడటంలేదు కదా!"

"తెలివిగా మాట్లాడుతున్నాననుకుంటున్నాడు వెధవ. వాడికసలు సిగ్గు అనే పదానికి అర్థం తెలుసా?" కసిగా తిట్టుకుంది.

"ఇతరుల వ్యక్తిగత విషయాలు తెలుసుకోవాలని మీకెందుకుసార్ అంత కుతూహలం? నా స్వవిషయాలు చర్చించేంత చనువు మీకెప్పుడూ ఇవ్వలేదే నేను! అయినా ప్రతి ఒక్కటీ మీకు చెప్పడానికి మీరేం నాకు బంధువా? స్నేహితులా? ఇంకెప్పుడూ ఇలా అతి చనువు ప్రదర్శించడానికి ప్రయత్నించకండి. చాలా అసహ్యంగా ఉంటుంది" అంటూ విసురుగా వెళ్ళిపోయింది. ఆ రోజు నుంచి మళ్ళీ ఎప్పుడూ అలాంటి పరిస్థితి ఎదురుకాలేదామెకు.

* * * * *

ఇప్పుడు మళ్ళీ పల్లవి చేతిలో పరువు పోగొట్టుకునే పరిస్థితి తెచ్చుకున్నట్టుంది. అతనికేసి చూడాలంటేనే కంపరంగా అనిపించింది సుధకి.

ఆవేశంతో రొప్పుతున్న పల్లవి భుజం మీద చెయ్యి వేసి అనునయంగా అడిగింది. "ఏం జరిగింది పల్లవీ?"

"ఎదురుగా దెయ్యం మోసం వేసుకొని నిలబడ్డాడు కదా! ఆ పెద్ద మనిషినే అడగండి" విసురుగా వచ్చింది సమాధానం.

అందరూ సుధాకర్‌వైపు తిరిగారు జవాబు చెప్పమన్నట్టు. ఇక మాట్లాడక తప్పలేదతనికి- "నేను... నేనేమన్నాను? ఆవిడేదో ఇబ్బందుల్లో ఉంది కదా, చేతనయిన సాయం చేద్దామని అడిగాను. తప్పా?" జారిపోతున్న ధైర్యాన్ని కూడదీసుకుంటూ బింకంగా అన్నాడు.

"ఏం నేను కష్టాల్లో ఉన్నా మహాప్రభో అని నా దగ్గర మొరపెట్టుకున్నానా? అవి తీర్చమని విన్నవించానా?' ' ఛీత్కారంగా అని, మిగిలినవారివైపు తిరిగి చెప్పిందామె- "నా భర్త వ్యసనపరుడనీ, ఇంటి బాధ్యతలు పట్టించుకోడని, స్థిరత్వం లేనివాడని తెలుసుకున్న ఈ మనిషి అది అలుసుగా తీసుకొని వెకిలిగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. నేనెంత తప్పించుకొని తిరిగినా, అవసరం ఉన్నా లేకపోయినా కల్పించుకొని మాట్లాడి, చొరవ తీసుకోవడానికి ప్రయత్నించేవాడు. ఈ విషయం ఎవరితోనన్నా చెప్తే నన్నే చులకనగా చూస్తారన్న భయంతో ఎవరికీ చెప్పకోలేక, ఇతడి మాటలు భరించలేక అవమానాన్ని గొంతులోనే దిగమింగుకొని కుమిలిపోయేదాన్ని. చివరికి... చివరికి.... ఈ రోజు ఎంతకు తెగించాడో తెలుసా? వాడు... వాడు... దుఃఖం కంఠానికి అడ్డుపడడంతో మాట్లాడలేక చేతుల్లో ముఖం కప్పకొని ఏడవసాగింది.

చుట్టుకున్న ఆమెను దగ్గరకు తీసుకుంది సుధ. "రిలాక్స్.. రిలాక్స్ పల్లవీ. ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్, జరిగిన విషయం చెప్ప"

స్నేహితురాలి ఓదార్పుతో తాత్కాలికంగా తేరుకున్న పల్లవి చెప్పసాగింది- అయోగ్యుడైన భర్తతో ఉంటూ నా జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నానట. అందుకని నా బ్రతుక్కొక అర్థాన్ని కల్పిస్తాడట ఈ యోగ్యుడైన మగాడు. అదీ చాలా రహస్యంగా" ఒక విధమైన తెగింపుతో క్రోధంగా చెప్పింది పల్లవి.

కప్పిపుచ్చుకోడానికి వీల్లేని విధంగా తన నైజం నలుగురి ముందు బట్టబయలు కావడంతో శిలలా నిలబడిపోయాడు సుధాకర్. అక్కడున్న అందరి చూపులు అతనిపట్ల అసహ్యంతో, కసితో నిండిపోయాయి.

ఇంత జరిగాక ఇంకా ఇక్కడ నేను పనిచేయడం అనేది ఎలాగూ కుదరనిపని. నిన్ను మాత్రం ఊరికే వదల్తాననుకోకు. నీ గుణం పదిమందికీ తెలిసేలా చేసి, నువ్వు తలెత్తుకు తిరగలేకుండా చేస్తాను చూడు" మరో బాంబు పేల్చింది పల్లవి.

ఆ మాటలతో పూర్తిగా జావకారిపోయాడతను. ఇప్పుడిప్పుడే నలుగురు పిల్లలు చేరుతున్నారు తన స్కూల్లో. ఇలాంటి సమయంలో ఈ విషయానికి ప్రచారం జరిగితే చెడ్డ పేరుతో స్కూలు మూతపడకతప్పదు. అదే జరిగినవాడు తను తినడానికి కూడా లేక రోడ్డున పడాల్సి వస్తుంది. ఒక్కపూట తిండికి కూడా ఇబ్బంది పడిన గతం గుర్తుకువచ్చిందతనికి. ఆ ఆలోచన రావడంతోనే వణికిపోయాడు. ఇక మరో దిక్కులేక పూర్తిగా కాళ్ళబేరానికి దిగిపోయాడు.

"పల్లవిగారూ! ప్లీజ్... నన్ను క్షమించండి. ఇక మీదట ఇలా జరగదు నా మాట నమ్మండి ప్లీజ్!" ప్రాధేయపడసాగాడు మనసులో తిట్టుకుంటూనే.

అందితే జుట్టు అందకపోతే కాళ్ళు అన్నట్టున్న అతని మాటలకు సమాధానం చెప్పకుండా చీదరింపుగా చూసి బయటకు దారితీసింది పల్లవి. ఆ వెనకే సుధ.

"చాలు పల్లవీ! చక్కటి షాక్ ట్రీట్‌మెంటిచ్చావు. ఒళ్ళంతా విషం నింపుకున్న ఈ పశువు ఈ ఒక్క సంఘటనతో మారిపోకపోయినా కాస్త ఒళ్ళు దగ్గరపెట్టుకొని ప్రవర్తించడం మొదలుపెడతాడు" సంతృప్తిగా అంది సుధ స్నేహితురాలి ధైర్యాన్ని అభినందిస్తూ.



రవీనా టాండన్ ఎంతో స్వీట్ గర్ల్. ఆమె నేను అభిమానించే హీరోయిన్లలో ఒకత్తె. అంతే కాని మా మధ్య ఎలాంటి 'వ్యవహారాలూ' లేవు అంటున్నాడు సునీల్ శెట్టి. అసలు మీరు నన్ను ఈ ప్రశ్న ఎలా అడుగుతారు? రెండు నెలల క్రితం వరకు ఆమె అక్షయ్ కుమార్‌తో తిరిగేది. అందువల్ల నేనెలా ఆమెతో ప్రణయం నడుపుతాను? అయినా నేను పెళ్ళయిన వాణ్ణే. నా భార్యను ప్రేమిస్తాను. ఈ ప్రపంచంలో నాకు అందరికంటే నా పిల్లలే ఎక్కువ అని సునీల్ అంటున్నాడు. నిప్పు లేకుండానే పొగ వచ్చే బాలీవుడ్‌లో సినీ రాతగాళ్ళకి మరి ఈ ఉప్పు ఎవరు అందించారో కాని సునీల్ చిటపటలాడిపోయాడు.